ముగిసిన సింగరేణి బ్రాంచ్ ఎన్నికలు

ఓటు హక్కు వినియోగించుకుంటున్న జీఎం శ్రీనివాసరావు

భూపాలపల్లి రూరల్, జనవరి 28 : భూపాలపల్లిలోని మంజూర్ నగర్ సింగరేణి ఇల్లందు క్లబ్ హౌస్‌లో ఆదివారం అఖిల భారత బొగ్గు గని అధికారుల సంఘం (సీఎంఓఏఐ) సింగరేణి బ్రాంచ్ ఎన్నికలు నిర్వహించినట్లు భూపాలపల్లి ఏరియా అధికార ప్రతినిధి అజ్మీరా తుకారాం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి బ్రాంచ్ ఎన్నికల్లో సింగరేణి బ్రాంచ్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి, తదితర స్థానాలకు సింగరేణి వ్యాప్తంగా ఉన్న అధికారులు పోటీలో నిలిచారని తెలిపారు. ఈ ఎన్నికలను రహస్య బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించినట్లు తెలిపారు. భూపాలపల్లి ఏరియాలో పనిచేస్తున్న 151 మంది అధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని వెల్లడించారు. ఈ ఎన్నికల నిర్వహణకు ఏరియా రిటర్నింగ్ అధికారిగా జీఎం బళ్లారి శ్రీనివాస్‌రావు, పర్యవేక్షకులుగా ఏరియా ఇంజినీర్ రామకృష్ణారెడ్డి, ఎస్‌వోఎం కృష్ణాప్రసాద్ నియమించారని ఆయన తెలిపారు.

వరదలను గుర్తించే అలారం ప్రాజెక్ట్ ప్రదర్శన

'కమ్యూనికేషన్ ట్రాన్స్‌పోర్ట్' ప్రాజెక్ట్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మహదేవపూర్, జనవరి 28 : మండల కేంద్రంలోని గ్రీన్‌వుడ్ పాఠశాల విద్యార్థులు సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు స్నేహ, మాధురి వరదలను ముందుగా గుర్తించే ప్రాజెక్ట్‌ను ప్రదర్శించారు. వరదలతో గ్రామాలకు ముప్పు వచ్చే ముందుగానే కనిపెట్టేందుకు వీలుగా ఉండే కమ్యూనికేషన్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాజెక్ట్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, పలువురు అభినందించారు.

ముగిసిన గొంతెమ్మ గుట్ట జాతర

మహదేవపూర్,(కాటారం)జనవరి 28 : కాటారం మండలంలోని ప్రతాపగిరి అటవీ ప్రాంతంలో గొంతెమ్మ గుట్టపై నాయకపోడు గిరిజనుల ఆరాధ్యదైవం లక్ష్మీ దేవర జాతర ఆదివారం ముగిసింది. భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి పూజలు చేశారు.

లారీల తనిఖీ

కాళేశ్వరం, జనవరి 28 : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఇసుక లారీలను రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ భూపాలపల్లి జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్ తారక్‌నాథ్‌రెడ్డి ఆదివారం తనిఖీ చేశారు. ఉన్నతాధికారుల అదేశాల మేరకు అదివారం కాళేశ్వరం నుంచి పుష్కుపల్లి వరకు లారీలను అపి తనిఖీ చేశారు. అధిక లోడ్ తీసుకెళ్తే చర్యలు తీసుకుంటామని డ్రైవర్లను హెచ్చరించారు.

మహదేవపూర్ సీఐ బదిలీ

మహదేవపూర్, జనవరి 28 : మండల కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న సీఐ కిరణ్ ఆదివారం ఖమ్మం జిల్లా సత్తుపల్లికి బదిలీ అయ్యారు. రెండున్నర సంవత్సరాలుగా కిరణ్ కుమార్ మహదేవపూర్‌లో సేవలందించారు. పోలీసులు ఆయనను సన్మానించి వీడ్కోలు పలికారు.

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా ములుగు జిల్లా, ములుగు మండలం, ములుగు గ్రామం వద్ద వ్యవసాయ భూమి ఎ. 1.00 గుంటల విస్తీర్ణం, సర్వే నం. 209/బి యొక్క దీని **సరిహద్దులు:** తూర్పు: అజ్మీరా భంజిగారి వ్యవసాయ భూమి, పడమర: నంద నాయకుడు గారి వ్యవసాయ భూమి, ఉత్తరం: కోయిల సాంబయ్య గారి వ్యవసాయ భూమి, దక్షిణం: ఇతరుల వ్యవసాయ భూమి, మరియు ములుగు జిల్లా, ములుగు మండలం, పల్సపల్లి గ్రామం వద్ద గల 180 చ.గజాల విస్తీర్ణంలో గల ఇల్లు ఇ.నెం. 13-138 మరియు **సరిహద్దులు:** తూర్పు: భుజగుంట్ల మొగిలి గారి ఇల్లు, పడమర: కొమరుల సమ్మయ్య గారి ఇల్లు, ఉత్తరం: రోడ్, దక్షిణం: బంధ కుమారస్వామి గారి ఇల్లు. పైన తెల్పిన 2 ఆస్తులు మరణించిన తోట రాధమ్మ వారసులు (ఆగ్నేట్స్) అయిన నాక్షయుంట్లు వేలుపుల లక్ష్మి మరియు ఆమె ఇతర కుటుంబ సభ్యులకు చెందినవి. దీనికి సంబంధించి పార్టిషన్ మరియు విడి స్వాధీనత కొరకు ఒక సివిల్ దావాను గౌరవనీయ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎట్ ములుగు ఫైలుపై O.S.No. 95/2023 ప్రకారం ఫైలు చేయబడింది మరియు అది పెండింగ్‌లో ఉంది. విషయం అనగా పై సదరు O.S.No. 95/2023 యొక్క సూట్ షెడ్యూల్ ఆస్తులు ఐటం నం.1 మరియు ఐటం నం.2 అయిన పై సదరు వ్యవసాయ భూమి మరియు ఇంటి ఆస్తికి సంబంధించి ఏ విధమైన అమ్మకం లావాదేవీ/ఒప్పందం అనుమతించబడదు అని సాధారణ ప్రజలను హెచ్చరించడమైనది. ఏవేని అటువంటి లావాదేవీలు జరిపినట్లయితే, అది వారి స్వంత నష్టపూరితీ అవుతుంది మరియు సదరు లావాదేవీలు న్యాయస్థానంలో చెల్లనివిగా పరిగణించబడతాయి. అందువల్ల ఈ ప్రకటన

సం/- **మహమ్మద్ అజామ్, అనీస్ ఫాతిమా, M.K. తన్వీరుద్దీన్,** అడ్వకేట్స్
ఇం.నం. 11-23-1419/1, దేశాయిపేట్ రోడ్, వరంగల్,
సెల్: 8801177977

తాగునీటి నమూనాల సేకరణ

ఏటూరునాగారం, జనవరి 28 : మేడారం జాతర ప్రధాన రహదారుల వెంట ఉన్న తాగునీటి బోర్లు, ట్యాంకుల్లోని నీటి నమూనాలను ప్రాంతీయ ఆరోగ్య ప్రయోగశాల రీజినల్ హెల్త్ ల్యాబొరేటరీ అధికారులు సేకరించారు. అలాగే చిన్నబోయిన పల్లి, మంగపేట మండలం చుంచుపల్లి, కమలాపురం, వాజేడు మండలం బొగత జలపాతం, తాడ్వాయి మండల కేంద్రంలో ఆదివారం పలు ప్రాంతాల్లో నీటి నమూనాలు సేకరించినట్లు బ్యాక్టీరియాలాజిస్టు కృష్ణ మూర్తి తెలిపారు. భక్తులు తాగునీటి ద్వారా ఎలాంటి అనారోగ్యానికి గురి కాకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

వనదేవతలకు వందనం..

- మేడారంలో భక్తజన ప్రవాహం
- ముందస్తు మొక్కులతో సందడి వాతావరణం

భక్తులతో జన సంద్రంగా మారిన గద్దెల ప్రాంగణం

తాడ్వాయి, జనవరి 28 : వనదేవతలకు భక్తులు నీరాజనాలు పలుకుతున్నారు. మహాజాతర సమీపిస్తుండడంతో ముందస్తు మొక్కుల కోసం పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి ప్రైవేట్, ఆర్టీసీ బస్సుల్లో మేడారానికి భక్తులు ప్రవాహంలా కదిలివచ్చారు. గంటలకొద్దీ లైన్లలో నిల్చొని అమ్మవార్లను దర్శించుకున్నారు. శివసత్తుల పూనకాలు, నెత్తిన ఎత్తుబంగారం(బెల్లం) పెట్టుకుని, మెడలో దండలు వేసుకుని వివిధ వేషధారణలో భక్తులతో వస్తున్న వారితో జాతర పరిసరాలు కోలాహలంగా మారాయి. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించిన తర్వాత వాగు ఒడ్డున ఉన్న నాగులమ్మ, జంపన్న గద్దెలకు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. సంతానం కలుగాలని దంపతులు జంపన్న గద్దెకు ముడుపులు కట్టారు. సమ్మక్క-సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెలపై పసుపు, కుంకుమ, ఎత్తుబెల్లం, నూతన వస్త్రాలు సమర్పించారు. యాట పోతులతో మొక్కులు చెల్లించుకుంటున్నారు. చెట్ల కింద విడిది చేసి వంటలు చేసుకుంటూ రోజంతా ఆనందంగా గడిపారు. రాత్రివేళలోనూ భక్తులు వస్తుండడంతో గద్దెల పరిసరాల్లో సందడి నెలకొంది. దీంతో వనమంతా జనాలతో నిండిపోయింది. తాడ్వాయి-మేడారం, మేడారం-పస్రా, కాల్వపల్లి, బయ్యక్కపేట, చిలుకలగుట్ట తదితర ప్రాంతాల్లోని అడవిలో చెట్టుకొకరు, పుట్టకొకరు విడిది చేయడంతో రోడ్లన్నీ వాహనాలతో నిండిపోయాయి.

మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

వనదేవతలను దర్శించుకున్న ప్రముఖులు

మేడారం సమ్మక్క, సారలమ్మను ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, హైకోర్టు జడ్జి రాజేశ్వర్‌రావు, యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్, సీసీఎల్ జాయింట్ సెక్రటరీ సవిత, సీఎం పీఆర్ఓ శ్రీనివాస్, ఇరిగేషన్ ఎస్ఈ విజయ్‌భాస్కర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి దేవాదాయశాఖ అధికారులు, అమ్మవార్ల పూజారులు స్వాగతం పలికి తల్లుల గద్దెల వద్దకు తీసుకెళ్లారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తులకు తాగునీటి పంపిణీ

వనదేవతల దర్శనానికి వచ్చిన భక్తులకు ఆదివారం దేవాదాయశాఖ అధికారులు తాగునీటిని పంపిణీ చేశారు. దర్శనానికి గంట సమయం పడుతుండడంతో గద్దెల ఎదురుగా ప్రధాన ద్వారానికి ఇరువైపులా క్యూలో వచ్చే భక్తులకు సిబ్బందిని నియమించి తాగునీటిని అందించారు.

ములుగులో వాహనాలతో రద్దీగా మారిన జాతీయ రహదారి

మేడారం భక్తులతో జాతీయ రహదారి రద్దీ

ములుగు రూరల్, జనవరి 28 : సమ్మక్క-సారలమ్మ తల్లుల దర్శనానికి ఆదివారం భక్తులు భారీ సంఖ్యలో మేడారానికి తరలివెళ్లారు. వచ్చిపోయే భక్తుల వాహనాలతో ములుగు జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి రద్దీగా మారింది. రెండు కిలో కిలో మీటర్ల పొడవున వాహనాలు వస్తూ కనిపించాయి. ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- రెండు పంటలకు సాగు నీరందిస్తాం
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

రాయినిగూడెం సన్మాన సభలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు రూరల్, జనవరి 28 : గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమల శాఖల మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం మంత్రి సీతక్క మండలంలోని గుర్తూర్‌తండా, కాసిందేవిపేట గ్రామాల్లో నిర్మించిన జీపీ భవనాలను ప్రారంభించారు. ములుగు జిల్లా కేంద్రంలోని గిరిజన భవనంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ములుగులోని డీఎల్ఆర్ గార్డెన్‌లో చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో కృత్రిమ పాదాల కొలతల శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. రాయినిగూడెంలో లోతట్టు గ్రామాల సన్మాన కమిటీ ఆధ్వర్యంలో మంత్రిని సన్మానించారు. ముందుగా సీతక్క తుడుందెబ్బ వ్యవస్థాపక అధ్యక్షుడు దబ్బకట్ల నర్సింగరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంచర్ల ఎర్రిగట్టమ్మ వద్ద మేడారం భక్తుల సౌకర్యార్థం నిర్మించిన కిచెన్ షెడ్‌ను సీతక్క ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ మారుమూల గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఆరు గ్యారెంటీలతో పాటు గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తామన్నారు. రైతులకు రెండు పంటలకు సాగు నీరందిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, జడ్పీసీఈఓ ప్రసూనారాణి, సర్పంచ్‌లు అహ్మద్‌పాషా, అమర్‌సింగ్, చేతన ఫౌండేషన్ సభ్యులు సీతారామయ్య, సురేశ్, సత్తులాల్, నవీన్, రషీద్, సాంబశివరావు, మంకిడి రవి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఏజెన్సీ వాసులకు మెరుగైన వైద్య సేవలందించాలి

గోవిందరావుపేట : ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య సేవలను మెరుగు పర్చాలని మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం ఆమె పీహెచ్‌సీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆపరేషన్ వెయిటింగ్ రూమ్, మేడారం భక్తుల కోసం చల్వాయిలో నిర్మించిన కిచెన్ షెడ్, దుంపిల్లగూడెంలో రూ.16లక్షలతో నిర్మించిన జీపీ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సృజన్‌కుమార్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, సర్పంచ్‌లు సమ్మయ్య, రాజు, ఉప సర్పంచ్ జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

రూ.2,29,76,000 చెక్కు అందజేత

1,278మంది పీసా కో-ఆర్డినేటర్లు, మొబిలైజర్లకు మంత్రి సీతక్క ఆదివారం జిల్లా కేంద్రంలో రూ.2,29,76,000 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పీసా జిల్లా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్, ముత్యాలరావు, ఆగబోయిన రవి, కార్తీక్, ఇర్ప వెంకట్, కొమురం చంద్రయ్య, ఇండ్ల సమ్మయ్య, వజ్జ రాజు, కోట మల్లేష్, ఇర్ప రాజు, పీసా మొబిలైజర్లు పాల్గొన్నారు.

దేవాదుల ఎత్తిపోతల వద్ద గోదావరి

నిర్విరామంగా దేవాదుల పంపింగ్

కన్నాయిగూడెం, జనవరి 28 : మండలంలోని దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులోని మోటర్ల ద్వారా గోదావరి నీటి పంపింగ్ కొనసాగుతోంది. ఇదివరకు నాలుగు మోటర్లతో పంపింగ్ జరుగుతుండగా ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆదివారం మరో మోటర్ ఆన్ చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. దేవాదుల వద్ద గోదావరి నీటిమట్టం 79.10 మీటర్ల ఎత్తులో స్థిరంగా ఉంది. ఐదు మోటర్లతో రోజుకి 1,415 క్యూసెక్కుల నీటిని భీంఘనపూర్ రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నారు. 2023-24 సంవత్సరానికి మోటర్ల ద్వారా 6.960 టీఎంసీల నీటిని తాగు, సాగునీటి అవసరాలకు తరలించినట్లు డీఈ శరత్ తెలిపారు. 29.8 కిలోమీటర్ల దూరంలోని భీంఘనపురం రిజర్వాయర్‌లోకి నీటిని తరలిస్తున్నారు. అక్కడ ఉన్న మోటర్లతో తాగు, సాగునీటి అవసరాలకు తరలిస్తారు.

ఆర్టీసీ కార్మికుల విలీన ప్రక్రియను పూర్తి చేయాలి

ములుగు రూరల్, జనవరి 28 : తెలంగాణ ఆర్టీసీ కార్మికుల విలీన ప్రక్రియ పూర్తి చేసి అపాయింట్‌మెంట్ డేట్ ప్రకటించాలని కోరుతూ మంత్రి సీతక్కకు కండక్టర్ ఐక్య వేదిక సభ్యులు ములుగులో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీలో 10 సంవత్సరాలుగా వేతన సవరణ జరగలేదని, తక్షణమే వేతన సవరణ చేసి విలీన ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో కండక్టర్ ఐక్య వేదిక జనవర్ సెక్రటరీ రవికుమార్, అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి, రాష్ట్ర ముఖ్య నాయకులు రంజిత్, మధు, మోహన్, కవిత, మాధవి పాల్గొన్నారు.

కళాశాలలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలి

ఏటూరునాగారం,జనవరి 28 : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అంతర్గత రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని మంత్రి సీతక్కను వినతిపత్రం అందజేసినట్లు ప్రిన్సిపాల్ చిన్న తెలిపారు. హైవే నుంచి కళాశాల వరకు, కళాశాలలో అంతర్గత సీసీ రోడ్డు నిర్మించాలని విన్నవించినట్లు తెలిపారు.

స్టాఫ్‌నర్స్ పోస్టులకు తాడ్వాయి మండల వాసులు

తాడ్వాయి, జనవరి 28 : వైద్య, ఆరోగ్య శాఖ ఇటీవల చేపట్టిన స్టాఫ్‌నర్స్ పోస్టులకు మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన ముగ్గురు ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన వడ్డాల రవిచంద్ర, కందికొండ శ్రవణ్, తనుగుల వర్ష స్టాఫ్ నర్స్ ఉద్యోగాలను పొందారు. వీరు ఇందిరానగర్ జడ్పీ పాఠశాలలో టెన్త్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. అనంతరం రవిచంద్ర, శ్రవణ్‌లు కరీంనగర్, వర్ష వరంగల్ ఎంజీఎం దవాఖానలో నర్సింగ్ కోర్సును పూర్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో భక్తులకు గాయాలు

గోవిందరావుపేట, జనవరి 28 : రోడ్డు ప్రమాదంలో మేడారం భక్తులకు గాయాలైన ఘటన మండలంలోని మచ్చాపూర్‌లో ఆదివారం జరిగింది. వరంగల్‌కు చెందిన జాఫర్ తన కారులో భక్తులను మేడారం తీసుకెళ్తుండగా మచ్చాపూర్ వద్ద జాతీయ రహదారిపై ఉన్న ట్రాక్టర్‌ను ప్రమాదవశాత్తు ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న రాజమణి, రజిని, కీర్తన గాయపడ్డారు. వారిని 108లో ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. రోడ్డు ప్రమాదం కారణంగా మచ్చాపూర్ వద్ద ట్రాఫిక్ జామ్ అయి కొంతసేపు వాహనాలు నిలిచిపోయాయి.

బాధితులకు బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

గణపురం, జనవరి 28 : మండల కేంద్రానికి చెందిన బందారపు యాదగిరి గౌడ్, తిరుపతిగౌడ్ తల్లి రకునమ్మ ప్రథమ వర్ధంతికి ఆదివారం బీఆర్ఎస్ నాయకులు హాజరయ్యారు. మృతురాలి చిత్ర పటం వద్ద నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ పూర్ణచంద్రారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎం కరుణాకర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ లక్ష్మీ నరసింహారావు, బీఆర్ఎస్ నాయకులు తిరుపతి గౌడ్, బోయిని సాంబయ్య పాల్గొన్నారు.

పాలెం ప్రాజెక్టు కాల్వలో పడి బాలుడి మృతి

మన్విత్ (ఫైల్)

వెంకటాపురం(నూగూరు) జనవరి 28: మండల పరిధిలోని ఒంటిమామిడి గ్రామంలో పాలెం ప్రాజెక్టు కాల్వలో పడి బాలుడు మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఒంటిమామిడి గ్రామానికి చెందిన రామకృష్ణ, రాధ దంపతుల 18 నెలల చిన్న కుమారుడు మన్విత్ చిన్నారులతో కలిసి అడుకుంటూ రోడ్డు దాటి వెళ్లి ప్రమాదవశాత్తు కాల్వలో పడి మృతి చెందాడు. బాలుడి తల్లిదండ్రుల రోదన గ్రామస్తులను కంట తడి పెట్టించాయి.

తిమ్మంపేటలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మంగపేట, జనవరి 28 : మండలంలోని తిమ్మంపేటలో 1977-78 సంవత్సరంలో పదవ తరగతి అభ్యసించిన పూర్వవిద్యార్థులు తాము చదివిన బడిలో ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో స్థిరపడ్డ మిత్రులు, ఆనాడు విద్యాబోధన చేసిన గురువులు సమావేశంలో పాల్గొన్నారు. పూర్వపు జ్ఞాపకాలను పంచుకున్నారు. తమ గురువులకు శాలువాలు, పూల మాలలు వేసి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు.

మృతుల కుటుంబాలకు జడ్పీటీసీ పరామర్శ

చిట్యాల, జనవరి 28 : మండలంలోని చల్లగరిగె గ్రామానికి చెందిన పోశాల ఓదయ్య, మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన సరిగొమ్ముల సమ్మక్క ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలను దివారం జడ్పీటీసీ గొర్రె సాగర్ పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్‌లు పూర్ణచందర్‌రావు, కర్రె మంజులా అశోక్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గుర్రం తిరుపతి, కట్కూరి రాజేందర్, మర్రి నరేశ్, ఎంచర్ల తిరుపతి, కన్నవేన అశోక్, సరిగొమ్ముల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

గట్టమ్మ సన్నిధిలో హైకోర్టు జడ్జి

గట్టమ్మ వద్ద రాజేశ్వర్‌రావు, లలితా శివజ్యోతి, మాధవి, రామ్మోహన్

ములుగు రూరల్, జనవరి 28 : ములుగు జిల్లా కేంద్రంలోని గట్టమ్మ దేవాలయాన్ని ఆదివారం భక్తులు దర్శించుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారా యి. అలాగే రాష్ట్ర హైకోర్టు జడ్జి నామవరపు రాజేశ్వర్‌రావు ఆదివారం గట్టమ్మను దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఆయనకు కలెక్టర్ ఇలా త్రిపాఠి, జడ్జిలు లలితా శివజ్యోతి, మాధవి, రామ్మోహన్, ఎస్పీ శబరీష్ మొ క్కలు అందించి స్వాగతం పలికారు. రాజేశ్వర్ రావు గట్టమ్మ తల్లికి పూజలు చేశారు.

'విద్యార్థి దశ మరువలేనిది'

గోవిందరావుపేట : విద్యార్థి దశ మరువలేనిదని హైకోర్టు జడ్జి రాజేశ్వర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల 1984-86 ఇంటర్ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. అదే బ్యాచ్‌కు చెందిన జడ్జి రాజేశ్వర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకరికొకరు సహకరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చంద్రమౌళి, సాయి మనోహర్ తదితరులు ఉన్నారు.

ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

మల్లూరు ఆలయంలో భక్తుల సందడి

మంగపేట, జనవరి 28 : మండలంలోని మల్లూరు లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో ఆదివారం పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. వారికి అర్చకులు ఆశీర్వచనాలు చేశారు. పూజా కార్యక్రమాల్లో అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలి

- గుడిసెవాసులకు పట్టాలివ్వాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

సీపీఐ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వెంకట్‌రెడ్డి

కృష్ణకాలనీ, జనవరి 28 : కాంగ్రెస్ ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో భగత్ సింగ్ కాలనీ మొదటి వార్షికోత్సవానికి సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కార్యవర్గ సభ్యుడు టీ శ్రీనివాసరావు హాజరై సీపీఐ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పేదలు వేసకున్న గుడిసెలకు కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కకు పెట్టి దేవుళ్లు, మతాల పేరుతో కాలక్షేపం చేస్తూ, పదేళ్ల పాలనలో దేశాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిందరి ఆరోపించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు గుడిసెవాసులకు పట్టాలిచ్చి మాట నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బోయిని అశోక్, పట్టణ అధ్యక్షు డు ప్రవీణ్ కుమార్, ఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసఫ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి క్యాతరాజు సతీశ్ కుమార్, సీపీఐ జిల్లా కమిటీ స భ్యులు కొరిమి సుగుణ, శ్రీకాంత్, గుడిసె వాసులు లావణ్య, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల మండల ఫోరం అధ్యక్షుడిగా వెంకన్న

వెంకన్న

గోవిందరావుపేట, జనవరి 28 : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మేడుదల వెంకన్న, ఉపాధ్యక్షులుగా ధర్మశాల సంజీవ, నామాల మురళి, గౌరవ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శిగా కడారి తిరుపతి, కార్యదర్శులుగా రేండ్ల శ్రీనివాస్, కొండి రమేశ్, కోశాధికారిగా కొండ రమేశ్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ వారు జిల్లా గౌరవ అధ్యక్షుడు మురహరి భిక్షపతి, జిల్లా కన్వీనర్ లకావత్ చందూలాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పనుల్లో వేగం పెంచి గడువులోగా పూర్తి చేయాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

తాడ్వాయి, జనవరి 28 : మేడారం జాతర సమీపిస్తున్నందున అభివృద్ధి పనుల్లో వేగం పెంచి గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ఆదివారం జాతర పరిసరాల్లో చేపట్టిన పనులను ఎస్పీ శబరీష్‌తో కలిసి పరిశీలించారు. అమ్మవార్ల గద్దెల వద్ద భక్తుల రద్దీని పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని పోలీసు, దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించారు.

ట్రాఫిక్‌ను నియంత్రించిన ఎస్పీ

మేడారం జాతర పరిసరాల్లో ట్రాఫిక్ సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఎస్పీ శబరీష్ ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా నియంత్రించారు. ఆదివారం 5లక్షలకు పైగా భక్తులు అమ్మవార్ల దర్శనానికి రావడంతో రోడ్లన్నీ వాహనాలతో నిండిపోయాయి. ఆర్టీసీ బస్టాండ్, వై జంక్షన్ వద్ద వాహనాలను క్రమబద్ధీకరించారు. సిబ్బందిని ఎప్పటికప్పుడూ అలర్ట్ చేస్తూ ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు చేపట్టారు.